ప్రజాశక్తి

శుక్రవారం 8 మార్చి 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

మహిళల శ్రమ దోపిడీ

- అన్ని రంగాల్లోనూ కొనసాగుతున్న వివక్ష
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

2 లో

వలస కూలీల ట్రాక్టర్ బోల్తా

18 మందికి తీవ్ర గాయాలు 2 లో

శివరాత్రి తిరునాళ్లకు సిద్ధం

- భారీగా తరలిరానున్న ప్రభలు
- ట్రాఫిక్ సమస్యపై పోలీసుల ముందస్తు నియంత్రణాచర్యలు

2 లో

14న జిల్లా, మండల కేంద్రాల్లో ఆందోళనలు

చలో ఢిల్లీకి మద్దతుగా

రౌండ్‌టేబుల్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ప్రజా సంఘాల నాయకులు 2 లో



వలస కూలీల ట్రాక్టర్ బోల్తా

18 మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్, క్రోసూరు : ట్రాక్టర్ బోల్తా పడి వలస కూలీలు గాయపడిన ఘటన క్రోసూరు మండలం 88 తాళ్లూరు సమీపంలో గురువారం జరిగింది. కర్నాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన 18 మంది వలస కూలీలు వ్యవసాయ కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు జిల్లాతోపాటు రాయచూర్‌కు చెందిన కూలీలు మిర్చి కోతలకు సత్తెనపల్లి మండలం భట్లూరు వచ్చారు. అక్కడే ఉంటూ చుట్టు పక్కల గ్రామాల్లో మిర్చి కోతలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం క్రోసూరు మండలం గాదేవారిపాలెంలో మిర్చి కోతలకు రాయచూర్‌కు చెందిన కూలీలు ట్రాక్టర్లో వెళ్లి సాయంత్రం తిరిగి వస్తున్నారు. ఈ మార్గంలో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. తాళ్లూరు సమీపంలో మలుపు తిరిగే సందర్భంలో డ్రైవర్ బ్రేకు వేయబోయి ఎక్సలేటర్ తొక్కడంతో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డుపక్కనున్న నీరు లేని పంట కాల్వలో బోల్తా పడింది. ట్రాక్టర్‌లో ఉన్న 18 మంది కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రులను సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆత్మస్థైర్యంతో మరింత ముందుకెళ్లాలి

ప్రజాశక్తి - తాడికొండ : మహిళలు ఆత్మస్థైర్యం, నైపుణ్యత అలవర్చుకొని మరింత ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూనమ్ మాలకొండయ్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం లాంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు ఆశించిందానికంటే ఎక్కువ ప్రగతి సాధించినా 34 శాతం మంది మహిళలు కుటుంబాన్ని -ఉద్యోగాన్ని సమన్వయం చేసుకోలేక ఉద్యోగాన్ని విడిచి పెడుతున్నారని చెప్పారు. ఎవరైనా వారిని ఆపుతారానే స్థాయి నుంచి మమ్మల్ని ఎవరు ఆపేది అనే విధంగా ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి దేవి మాట్లాడుతూ వివిధ రంగాలలో ఎంతో కీర్తి గడించిన మహిళలను గుర్తు చేస్తూ వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. అనంతరం క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన పరిపాలనా భవనం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌కు చెందిన మహిళ ఉద్యోగులకు బహుమతి ప్రదానం చేశారు.

కళ్లం కళాశాలకు ఈక్వాలిటీ ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు : కళ్లం ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థినులు సేల్స్‌ఫోర్స్ కంపెనీ ద్వారా వెయ్యి మందికిపైగా ఇంటర్న్‌షిప్‌లు పూర్తి చేసిన సందర్భంగా 'ఈక్వాలిటీ ఎక్స్‌లెన్స్ అవార్డు'ను హైదరాబాద్‌లోని టి-హబ్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో అందుకున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ యం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. 2023 విద్యా సంవత్సరంలో తమ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేయటం గొప్ప విషయమని ప్రిన్సిపాల్ బిఎస్‌బి రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలేజి ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పి.యల్.మాధవరావు, విభాగాధిపతులు విద్యార్థినుల ప్రతిభను అభినందించారు.

మహిళల శ్రమ దోపిడీ

- అన్ని రంగాల్లోనూ కొనసాగుతున్న వివక్ష
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నా ఇప్పటికీ వివక్ష కొనసాగుతోంది. శ్రమ దోపిడీ అధికంగా ఉంటోంది. కుటుంబ అవసరాల కోసం కాయకష్టం చేయక తప్పని పరిస్థితి మహిళలకు ఎదురవుతోంది. విద్యా,ఉద్యోగ అవకాశాల్లో పురుషుల కన్నా మహిళలు వేగంగా దూసుకుపోతున్నా ఇప్పటికీ మార్పు పూర్తిగా రావడం లేదు. విద్యాభ్యాసంలో నూటికి నూరు శాతం మహిళలు విద్యావంతులు కాలేకపోతున్నారు. కుటుంబాల్లో ఉన్న ఆర్థిక, సామాజిక పరిస్థితులతో పాటు సాంఘీక అంశాలు కూడా ఇందుకు ప్రతిబంధకంగా మారుతున్నాయి. విద్యాభ్యాస్యం నుంచి డ్రాప్ అవుట్స్‌లో బాలికలే ఎక్కువ.

శ్రామిక మహిళలకు శ్రమ దోపిడీ తప్పడంలేదు. ఎక్కువ పనిచేయించుకుని తక్కువ వేతనాలు ఇచ్చే పరిస్థితి ఉన్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికీ వివిధరంగాల్లో శ్రామిక మహిళలు కాయకష్టం చేసి కుటుంబాలను పోషిస్తున్నారు. భవననిర్మాణ రంగంతోపాటు వ్యవసాయ కార్మికులుగా కూడా రోజుకు కనీసం 10 గంటల పాటు కాయకష్టం చేస్తున్నారు. చదువుకున్న మహిళలు కూడా సెక్యూరిటీ గార్డులుగా గంటల తరబడి నిలబడి అనారోగ్యంకు గురవుతున్నారు. దుకాణాలు, వ్యాపార సంస్థలలో రోజుకు సగటున 8 గంటలు నిలబడి పనిచేయడంతో ఎక్కువ మంది తక్కువ కాలంలో ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. కార్పొరేట్ సంస్థల్లో పూర్తి ఎసిలో పనిచేస్తున్నట్టు కన్పిస్తున్నా గంటల తరబడి నిలబడి పనిచేయాల్సిఉంటోంది. బిల్లింగ్ కౌంటర్లు, సేల్స్‌రంగంలోనూ ఇదే పరిస్థితి. కార్పొరేట్ విద్యా,వైద్య సంస్థల్లో కూడా ఎక్కువ సేపు నిలబడి పనిచేయాల్సిన పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఉపాధ్యాయ రంగంలోకూడా రోజుకు ఐదారు క్లాసులు చెప్పాల్సిన పరిస్థితులు మహిళలకు అత్యంత ఇబ్బందికరంగా మారుతున్నాయి. మునిసిపాలిటీలు, పంచాయతీలలో శానిటరీ వర్కర్లుగా మహిళలు ఇతోధికమైన సేవలు అందిస్తున్నారు. ఎవ్వరూ చేయలేని పనులను శానిటరీ వర్కర్లు ఎక్కువగా చేస్తున్నారు. వీరికి ఇచ్చేవేతనాలు చాలా తక్కువ. అంతేగాకుండా వీరికి తరచూ ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నారు. చెత్తా చెదారం సేకరణలో వీరికి ఎదురవుతున్న ఇబ్బందులు అన్ని ఇన్నీకావు. వైద్య రంగంలో నర్సులు,ఆయాలుకూడా పనుల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళలకు తరచూ బదిలీలు, వేధింపులు ఎక్కువగా కన్పిస్తున్నాయి. పభుత్వ, ప్రైవేటు కార్యాలయాలో లైంగిక వేధింపులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. పోలీసు శాఖలో పనిచేసేకానిస్టేబుల్స్‌కు కూడా వివక్ష, వేధింపులు తప్పడంలేదు. చాలా మందికి ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల వేధింపులను ఎక్కువ మంది బైటికి చెప్పుకోలేక పోతున్నారు. ప్రధానంగా ఫ్యాక్టరీలు, కార్ఖానాల్లో పనిచేసే మహిళలకు భద్రత కొరవడింది. భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు ఎక్కువ రోజులు మండుటెండల్లోనే పని చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఘనంగా మహిళా దినోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా గురువారం పలు విద్యా సంస్థలు, కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. అవగాహన సదస్సులు, మహిళలకు, విద్యార్థినులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందచేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారధి అధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి, న్యాయమూర్తులు వి.ఎ.ఎల్.సత్యవతి, జి.అర్చన, కె.నీలిమ,మహిళా న్యాయవాది ఎస్.బి.ఎ.ఝాన్సి ప్రసంగించారు. కార్యక్రమంలో జడ్జీలు, న్యాయవాదులు పాల్గొన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 'ఇన్‌స్పైర్ ఇన్‌క్లూజన్' అనే ఇతివత్తంతో నిర్వహించిన వేడుకల్లో డీఆర్‌డీవో, సీఎమ్ఎస్‌డీఎస్ డైరక్టర్ డాక్టర్ మధుమిత చక్రవర్తి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అవినయ నాచురల్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరక్టర్ బాలక్రిష్ణ కోడూరు మాట్లాడారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు. జెకెసి కాలేజీలో మహిళా స్వీపర్లు, అటెండర్లకు కాలేజి పాలకవర్గ సభ్యులు మాదల రత్నగిరిబాబు చీరలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, యస్.ఆర్.కె.ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల, ఇండియన్ ఫార్మసుటికల్ అసోసియేషన్ అమరావతి లోకల్ బ్రాంచ్ సంయుక్తంగా వేడుకలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడారు.

శివరాత్రి తిరునాళ్లకు సిద్ధం

కోటప్పకొండ ఆలయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

మహాశివరాత్రి తిరునాళ్లకు ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ ముస్తాబయ్యాయి. శుక్రవారం తెల్లవారుజూము నుంచి శనివారం ఉదయం వరకు కోటప్పకొండ, అమరావతి, గోవాడ, క్వారీ, దైద, సత్రశాల, పెదకాకాని తదితర శైవక్షేత్రాలకు వచ్చే సందర్శకుల కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ప్రధానంగా రవాణా సౌకర్యం కోసం ఆర్‌టిసి మొత్తం 700 బస్సులను నడుపుతోంది. వీటితో పాటు ప్రయాణికులు సొంతంగా ప్రైవేటు వాహనాల్లో తరలివచ్చే వారితో రద్దీ ఏర్పడే అవకాశం ఉండటంతో పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. శైవ క్షేత్రాల వద్ద పార్కింగ్ ప్రదేశాలను గుర్తించారు. ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా నర్సరావుపేట పరిసరాల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా నియంత్రణ చర్యలు చేపట్టినట్టు పల్నాడుజిల్లా ఎస్‌పి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. భారీగా ప్రభలతో యాత్రికులు, రైతులు తరలిరానున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు సంబంధిత నాయకుల ఫొటోలు, సినీ నటుల ఫొటోలు, సినీ, రాజకీయ గీతాలతో ప్రభలను తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనివల్ల రాజకీయ వివాదాలు తలత్తి వల్ల శాంతిభద్రతల పరిస్థితి ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది.

భారీ విద్యుత్ ప్రభలను ఇప్పటికే పలు గ్రామాల నుంచి సిద్ధం చేస్తున్నారు. కోటప్పకొండకు మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు విఐపిలకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేస్తున్నారు. అన్ని క్షేత్రాల వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆయా శైవ క్షేత్రాలను రంగులు, విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. కోటప్పకొండలో జరిగే శివరాత్రి వేడుకలను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, పల్నాడుజిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాష్ట్ర మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజనీ, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు, ఇతర ప్రజా ప్రతినిధులు కోటప్పకొండకు రానున్నారు. దేవాదాయశాఖ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమరావతి, పెదకాకాని, గోవాడ, క్వారీ తిరున్నాకు కూడా విస్తృత ఏర్పాట్లు చేశారు. క్వారీ తిరునాళ్ల ఏర్పాట్లను ఎస్‌పి తుషార్ దూడి పరిశీలించారు. గుంటూరు నుంచి ఉమ్మడి జిల్లాలోని అన్ని శైవక్షేత్రాలకు ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్టు ఆర్‌టిసి అధికారి రవికాంత్ తెలిపారు.

చలో ఢిల్లీకి మద్దతుగా
14న జిల్లా, మండల కేంద్రాల్లో ఆందోళనలు

సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ప్రజాశక్తి - మాచర్ల

దేశ జనాభాలో 70 శాతంగా ఉన్న రైతు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కరంలో కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని రైతుసంఘ రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య విమర్శించారు. స్థానిక శ్రీ కోదండ రామాలయంలో గురువారం జరిగిన అఖిలపక్ష సంఘాల రౌండ్ టేబుల్ సమావేశానికి సిపిఎం నాయకులు బి.మహేష్ అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 540 రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో రైతులు ఢిల్లీలో పోరాడిన సందర్భంగా అనేక మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని, ఈ క్రమంలో రైతు పోరాటానికి దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామిచ్చినా వాటిని విస్మరించింద్నఇ అన్నారు. పైగా ఆ నల్ల చట్టాలనే దొడ్డిదారిన అమలు చేసి వ్యవసాయాన్ని కార్పొరేట్ల పరం చేస్తోందని మండిపడ్డారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 14న చలో ఢిల్లీకి ఎస్‌కెఎం పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ ఆందోళనకు మద్దతుగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ఆందోళన చేపట్టాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సును అమలు చేసి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని, కేరళ తరహ రుణ ఉపశమన చట్టాలు తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించి, రోజువారీ కూలి రూ.600కు పెంచాలని, ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని కోరారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠ పరచాలన్నారు. అనంతరం సిపిఐ నాయకులు ఎం.బాబురావు, సిటియు నాయకులు అబ్రహం లింకన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జాని, బిఎస్‌పి నాయకులు సైదులు యాదవ్ మాట్లాడారు. సురేష్, శోభన్‌కుమార్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతో ఉపాధి, ఉద్యోగాలు సాధ్యం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

వృత్తి, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ ఉపాధి, ఉద్యోగావకాశాలు పొంద డం సాధ్య పడుతుందని యుఎస్ఎలోని నెబ్రాస్కా విశ్వ విద్యాలయం ఎకనామిక్స్ ప్రొఫెసర్ వాణి కొచ్చెర్లకోట అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఎక నామిక్స్ విభాగం సెమినార్ హాలులో ఒక్కరోజు విదేశాలలో ఉన్నత, విద్య ఉపాధి అవకాశాలు అంశంపై గురువారం వర్క్ షాప్ జరిగింది. కార్యక్రమానికి ఎకనామిక్స్ విభాగ అధిపతి, కాలేజీ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య కడిమి మధుబాబు అధ్యక్షత వహించారు. ముఖ్యవక్త వాణి మాట్లాడుతూ ఆకాశమే హద్దుగా ప్రపంచ దేశాలలో భారతదేశ విద్యార్థులు, యువత అనేక రంగాలలో రాణిస్తున్నారని చెప్పారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డేటా సైంటిస్టులు, సైబర్ సెక్యూరిటీ అనలిస్టులు వంటి ఉద్యోగాలు వారి ప్రత్యేక నైపుణ్యాల డిమాండ్ కారణంగా లభిస్తున్నాయని వివరించారు. ముఖ్యంగా రీజనింగ్, అర్థమెటిక్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ నైపుణ్యం, ఆంగ్ల భాష పై పట్టు వంటి ప్రత్యేక నైపుణ్యాలు ప్రతి విద్యార్థి కలిగి ఉండాలని తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు. అనంతరం వాణిను అధ్యాపకులు ఆచార్య కడిమి మధు బాబు, ఆచార్య సి ఎస్ ఎన్ రాజు లు సత్క రించారు. కార్యక్రమంలో ఎకనామిక్స్ అధ్యాపకులు కె.మహేంద్ర కుమార్, డాక్టర్ ఎన్.బాబు, డాక్టర్ పి. శ్యామ్సన్, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరావు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత జూట్ మెటీరియల్ పంపిణీ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగం లోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో జరుగుతున్న జూటు వస్తువుల తయారీ కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందుతున్న 50 మంది మహిళలకు ఉచితంగా జూట్ మెటీరియల్ ను ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది మహిళల అభ్యర్థన మేరకు నేర్చుకునే సౌలభ్యం కోసం అదనంగా మూడు కుట్టు మిషన్లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వర్సిటీ చరిత్రలో తొలి మహిళ రిజిస్ట్రార్ గా, తొలి మహిళ ఓఎస్డిగా ఆచార్య బి.కరుణ, ఆచార్య సునీతలను సన్మా నించారు.

ఫిజిక్స్ విభాగంలో ముగిసిన జాతీయ సదస్సు

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని ఫిజిక్స్ విభాగం రెండు రోజులుగా నిర్వహిస్తున్న మెటీరియల్ సైన్స్ అండ్ క్యారెక్ట రేజేషన్ టెక్నిక్స్ అనే యుజిసి జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉన్నత విద్య మండలి కార్యదర్శి ప్రొఫెసర్ నజీర్ అహ్మద్ పాల్గొని మాట్లాడారు.

పరిశోధనలు మెరుగుకు వర్క్‌షాపులు

విశ్వవిద్యాలయంలోని విద్యావిభాగం సేవలు అత్యున్నతంగా విద్యార్థులకు, పరిశోధకులకు దోహదపడుతున్నాయని రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి కొని యాడారు. రెండు రోజులుగా విద్యా విభా గం లో జరుగుతున్న వర్క్‌షాపు ముగింపు సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజ రయ్యారు. ఎ.ఎల్. కళాశాల ప్రాచార్యులు ఆచార్య ఎస్తేర్ సునీల, వర్క్‌షాప్ అధ్యక్షులు డాక్టర్ పి.బ్రహ్మాజీ రావు మాట్లాడారు. 300 మందికి పైగా విద్యార్థులు, పరిశోధక విద్యా ర్థులు దేశం నలుమూలల నుండి పలువురు విద్యావేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలు వాయిదా

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో అన్ని పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల నాలుగవ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్‌రావు తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 27 నుంచి ప్రారంభం అవ్వాల్సిన పరీక్షలను వాయిదా వేశామన్నారు. తిరిగి పరీక్షలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి యధావిధిగా కొన సాగుతాయని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఎటువంటి మార్పు లేదని ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహిస్తామన్నారు.

ముగిసిన రీసెర్చ్ మెథడాలజి కోర్సు

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్, ఆచార్య నాగార్జున విశ్వ విద్యా లయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఏడు రోజుల రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ గురువారంతో ముగిసింది. ఈ కోర్సులో 28 సెషన్స్ లు, థియరీ, ప్రాక్టికల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. 7 రాష్ట్రాల నుంచి సుమారు 40 కి పైగా పరిశోధకులు ఈ కోర్సుకు హాజరయ్యారు.

ఉద్యోగి మృతికి సంతాపం

ఎఎన్‌యు లో టైం స్కేల్ ఎంఆర్ గా విధులు నిర్వహిస్తున్న కాజాకు చెందిన శివయ్య మృతిపై వర్సిటీ సంతాపం ప్రక టించింది. రిజిస్టర్ కార్యాలయం వద్ద గురు వారం సంతాప సభ ఏర్పాటు చేశారు.

పిచ్చికుక్క దాడి: ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-తాడికొండ: తాడికొండ శివారు బడేపురంలో గురువారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామంలో పనులకు వెళ్లే వారిని వెంటపడి కరవడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఒక మహిళ, ఓ చిన్నారికి ఎక్కువ గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. పిచ్చికుక్కల బారి నుండి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. సమాచారం అందుకున్న పంచాయతి సిబ్బంది, వీధికుక్కలకు వ్యాక్సిన్ వేయాలని పశువైద్యాధికారికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, గుడివాడ

ఓ.యస్.నెం.20/2023

బిట్వీన్:
Ivaturi Jayaram ...Plaintiff
And
Gokavarapu Suryakumari And 4 others ...Defendants

To,
(D1) Gokavarapu Suryakumari W/o Late Venkatapandu Ranga Rao, Hindu, aged 69 years, Homemaker, R/o.D.No.7/258a, Tilak Road, 7th Ward, Gudivada-521301, Krishna District.
(D3) Gokavarapu Parvathy, W/o Kasula Veeravenkata Lakshmi Narayana Rao, Hindu, aged 49 years, Medical Practitioner, D.No.23/194, Palnadu Road, Vinukonda Town, Guntur Distrcit.
(D4) Gokavarapu Venkata Lakshmi, W/o Matturi Srinivasu, Hindu, aged 47 years, D.No.15/221-1, A.P.S.R.T.C Employee, Satyanarayanapuram, Gudivada-521301, Krishna District.
(D5) Koda Sampath Kumar S/o Madhana Rao, Hindu, aged 70 years, Vasavi Dreams Plot No.E-210, Santhnagar, Road No.2, Zeck Colony, Hyderabad.

పై నెంబర్ గల దావాలో ప్రతివాదులు 1 మరియు 3 to 5 అను వార్లుకు దావా సమన్లు నిమిత్తం ది.22-03-2024 తేదిన వాయిదా ఉన్నది. కనుక వాయిదా రోజు ఉదయం 10-30 గం.లకు 1,3to5 అను ప్రతివాదులు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు పై కోర్టువారి ఎదుట తెలుపుకొన వలెను. లేనియెడల మీకు పరోక్షమున తీర్మానించ బడునని యిందుమూలంగా తెలియజేయట మైనది.

వాయిదా తేది:22-03-2024

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

ఇట్లు
శ్రీ సి.రవికుమార్,
శ్రీ కె.బాలకృష్ణ,
వాది తరుపు న్యాయవాదులు,
గుడివాడ, సెల్:7093420723.

క్రమశిక్షణతో పనిచేయండి

నర్సింగ్ విద్యార్థులకు సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ సూచన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి నర్సింగ్ స్కూల్ లో విద్యార్థిని విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ హెచ్చరించారు. గురువారం స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థుల తో జరిగిన సమావేశం లో ఆయన పలు సూచనలు జారీ చేశారు. ఇటీవల కాలంలో ఫ్రెషర్స్ డే , ఫేర్ వెల్ ఫంక్షన్ల ను ఇక నుంచి ఆపేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమాలు చేసేందుకు విద్యార్థులు డబ్బులు వసూలు చేసే విషయంలో మనస్పర్థలు వస్తుండటం వల్ల ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యార్థులు నర్సింగ్ స్కూల్‌కు వచ్చి వెళ్లే సమాచారం కోసం బయో మెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు విద్యా ర్థులు స్వయంగా వంటకాలు చేసుకోవడం వల్ల ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఒక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించాలని, డైనింగ్ హాలు, కిచెన్ హాలులో, రీడింగ్ రూమ్‌లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని దేశించారు. విద్యార్థుల హాజరు విషయంలో ట్యూటర్స్ కు బాధ్యత అప్పగించాలని సూచించారు.

ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తే షాపులు సీజ్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో డిఅండ్ఒ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపా రాలు చేస్తే ఆయా షాపులు సీజ్ చేయటంతోపాటు, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజారోగ్య అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రేడ్‌లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వ హిస్తున్న షాపులపై దాడులు చేసి సంగడిగుంట మెయిన్ రోడ్డులోని స్పైసీ ఫుడ్స్ అండ్ టిఫిన్స్‌ని సీజ్ చేశారు. చట్ట ప్రకారం నగరంలో ప్రతి వ్యాపార వాణిజ్య సంస్థ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. సచివాలయాల వారీగా ట్రేడ్ లైసెన్స్‌ల వివరాలు సేకరిస్తున్నామని, వివరాలు అందిన వెంటనే చర్యలు ఉంటాయ న్నారు. గతంలో తీసుకున్న లైసెన్స్ లను రెన్యు వల్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్ఒ (ఎఫ్ఎసి) ఎన్.మధు సూదనరావు, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మిర్చి నిల్వలు

బ్యాగులు		
మిర్చి దిగుమతి	:	1,25,293
మిర్చి ఎగుమతి	:	1,44,649
మిర్చి నిల్వ	:	89,789

మిర్చి ధరలు

రూపాయలలో	
334	9,000 - 20,000
నెం.5	11,000 - 19,000
273	12,300 - 15,500
341	10,000 - 19,000
4884	11,000 - 18,500
సూపర్ 10	12,500 - 16,500
నాన్ ఎసి	
తేజ	8,000 - 20,000
బడిగె	9,500 - 20,000
దేవనూరు డీలక్స్	10,000 - 19,000
తాలుకాయలు	5,000 - 12,000

In The Court of the XII Addl.District Judge, at Vijayawada.
IP No.4/2018

Between
Kotha Venkateswarlu ...Petitioner
And
Javvadi Suresh and others ...Respondents

R9. D.Rajesh, S/o Dilip, C/o D.Rajesh&Co, Jain Mandir, Osman Gunj, Main Bazar, Hyderabad.
R10. M/s Sai Ram Traders, Rep.by its Prop. Jaganath, Opp. Chetri Begum Bazar, Hyderabad.
R12. Kakumanu Srinivasa Rao, S/o Anjaneyulu, R/o Kota Bazar, Narasaraopet, Guntur Dt.

పై నెంబరు Insolvency Petition ను పిటిషనర్, Insolvent గా Declar చేయమని దాఖలు చేసుకొని యున్నారు. సదరు I.P లో రెస్పాండెంట్లు 9, 10 మరియు 12 వార్లకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనని కారణంగా ఈ పబ్లికేషన్‌ను చేయుచూ ది. 19-03-2024 తేదిన ఉ.10-30లకు రెస్పాండెంట్లు 9, 10 మరియు 12 లు స్వయంగా గాని అడ్వకేటు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు వున్నయెడల తెల్పుకొనవలెను.

కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం

విజయవాడ,
తేది: 07-03-2024

కొటారి శ్రీనివాసరావు,
పిటీషనర్ తరుపున అడ్వకేటు,
పటమట,
విజయవాడ.

A.P. STATE WAREHOUSEING CORPORATION, TENALI వారు ఇచ్చిన ఒరిజినల్ రశీదు పోయినది, రశీదు నెం: 210045404559.

గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, నవులూరు గ్రామాం, శివాలయం స్ట్రీట్, డోర్ నెం. 2-160 కాపురస్తులు మాడపాటి వెంకటేశ్వర్లు గారి కుమారుడు మాడపాటి సాంబశివరావు వారి ద్వారా సంజాయిషి పొందిన పిమ్మట యావన్మందికి తెలియజేయునది ఏమనగా ...

నా యొక్క క్లయింట్ అయిన మాడపాటి సాంబశివరావు ది.01-03-2024 వ తేదిన స్వగ్రామం అయిన నవులూరు గ్రామం ఇంటి వద్ద నుండి జీరాక్స్ నిమిత్తం ద్విచక్ర వాహనం పై బయలుదేరి నవులూరు గ్రామంలో గల జీరాక్స్ సెంటర్ నకు వచ్చి నా క్లయింట్ తన యొక్క బ్యాగ్ చూడగా బ్యాగ్ లో గల ఒరిగిజినల్ **A.P. STATE WAREHOUSEING CORPORATION, TENALI వారు ఇచ్చిన ఒరిజినల్ రశీదు పోయినది, రశీదు నెం: 210045404559.** సదరు రశీదు ఏమనగా నా క్లయింట్ అయిన మాడపాటి సాంబశివరావు గారి సొంత పొలములో పండిన ధాన్యమును యడ్లపల్లి నుంచి తీసుకొని వచ్చి తెనాలి లో గల A.P. STATE WAREHOUSEING CORPORATION, TENALI నందు స్టోర్ చేయటమైనది. స్టోర్ చేయగా వారు ఇచ్చిన వారు రశీదు పోయినది. సదరు రశీదు కోసం ఎంత వెతికనను దొరకలేదు.

కావున సదరు A.P. STATE WAREHOUSEING CORPORATION, TENALI వారు ఇచ్చిన రశీదు ఎవరికైనను దొరికినచో ఈ క్రింది అడ్రెస్స్ నకు తెలియపరచగలరు. అట్లు కానీ పక్షములో ఎవరైన ఏ విధమైన అన్యాక్రాంతము చేసినచో మెముతీసుకొను చట్టపరమైన చర్యలకు మీరే బాధ్యులు.

మంగళగిరి,
తారీఖు :07-03-2024

బుల్లా చందు. B.Tech., B.L.
బుల్లా రమేష్ బాబు, B.A., LL.B.
అడ్వకేట్ & నోటరి, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్
డోర్ నెం: 5-517, రాజీవ్ సెంటర్, మంగళగిరి,
గుంటూరు జిల్లా, సెల్ నెం : 9394076578

గ్రామ పంచాయితీ కార్యాలయము, వెనిగండ్ల

టెండరు షెడ్యూలు ప్రకటన

పెదకాకాని మండలం, వెనిగండ్ల గ్రామపంచాయతీకి 2024-25 సం॥నకు సంబంధించిన టెండరు పోస్టులు కొరకు టెండర్లు కోరబడుచున్నవి. ఈ దిగువ తెలిపిన టెండరు పోస్టుల కొరకు సీల్డు టెండర్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని ది. 16-03-2024వ తేదీన మధ్యాహ్నం 12.00 గం.ల వరకు స్వీకరించబడి అదేరోజు సాయంత్రం 4-00 గం.లకు హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరువబడును. టెండరు దాఖలు చేయువారు షెడ్యూలులో తెలిపిన ధరావత్తు మొత్తం చెల్లించిన రసీదును జతపరిచి టెండరు దాఖలు చేయవలెను. ధరావత్తు చెల్లించని టెండర్లు తిరస్కరించబడును. ఏ కారణము తెలుపక ఈ టెండర్లు వాయిదా వేయుటకు లేదా మార్పులు చేయుటకు కార్యదర్శి గారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములకు కార్యాలయం పనివేళల యందు సంప్రదించవచ్చును.

టెండరు షెడ్యూలు

వ.నెం.	సం॥	టెండరు వివరములు	టెండరు ధరావత్తు
1.	2024-25	గ్రామపంచాయతీకి అవసరమగు టెండరు స్వీపర్లు సిబ్బంది (4)	200-00
2.	2024-25	గ్రామపంచాయతీకి అవసరమగు టెండరు ఎలక్ట్రీషియన్ కం ఫిట్టర్ (2)	200-00
3.	2024-25	గ్రామపంచాయతీకి అవసరమగు టెండరు ఎలక్ట్రీషియన్ (1)	200-00
4.	2024-25	గ్రామపంచాయతీకి అవసరమగు టెండరు వాలు ఆపరేటర్ (3)	200-00
5.	2024-25	గ్రామపంచాయతీకి అవసరమగు టెండరు పంపుహౌస్, వాటర్ ట్యాంక్ వాచ్‌మెన్ (2)	200-00
6.	2024-25	గ్రామపంచాయతీకి అవసరమగు టెండరు ఆఫీసు నైట్ వాచ్‌మెన్ (1)	200-00
7.	2024-25	గ్రామపంచాయతీ మైత్రీ కళ్యాణ మండపం నందు టెండరు వాచ్‌మెన్ పోస్టు (1)	200-00
8.	2024-25	గ్రామపంచాయతీకి అవసరమగు టెండరు డ్రెయిన్ క్లీనర్స్ సిబ్బంది (3)	200-00
9.	2024-25	గ్రామపంచాయతీకి అవసరమగు టెండరు పారిశుధ్య ట్రాక్టర్ డ్రైవర్ (1)	200-00
10.	2024-25	PH సామానులు కొనుగోలు చేయుట	200-00
11.	2024-25	అవసరమైన ఎలక్ట్రికల్ సామానులు సప్లయి చేయుట	200-00
12.	2024-25	PWS సామానులు సప్లయ్ చేయుట	200-00

తేది :- 07.03.2024

సం/- జి.హరిబాబు
పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ, వెనిగండ్ల

ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిపో మేనేజర్, పోలీసులు

తిరునాళ్లకు చిలకలూరిపేట నుండి 100 బస్సులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మహాశివరాత్రి సందర్భంగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది చిలకలూరిపేట నుంచి కోటప్పకొండకు 100 బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్. రాంబాబు తెలిపారు. వీటిల్లో చిలకలూరిపేట డిపో బస్సులు 37 కాగా ఇతర డిపో బస్సులు 67 ఉన్నాయని చెప్పారు. డిపో కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ ఛార్జీలే పెద్దలకు రూ30, పిల్లలకు రూ.15 చొప్పున ఉంటాయని తెలిపారు. ఈ బస్సుల కోసం పురుషోత్తపట్నం వద్ద, కోటప్పకొండ వద్ద బస్టాండ్లను ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా కట్టుబడివారిపాలెం, కమ్మవారిపాలెం, గోవిందపురం మీదుగా పురుషోత్తపట్నం వరకు ఈ బస్సులను నడుపుతామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మార్గం మధ్యలో తాగునీరు, మజ్జిగను ఉచితంగా సరఫరా చేస్తామని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుట్టబోయే బిడ్డలపైనా అప్పుల భారం మోపిన జగన్ : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అప్పులప్రదేశ్‌గా మార్చిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందని మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. ఈ మేరకు పట్టణంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మళ్లీ గెలవడం సాధ్యం కాదన్న విషయం ఇప్పటికే జగన్‌కు అర్థమైందని, అందుకే దొంగ బిల్లులు డ్రా చేసుకునేందుకు సచివాలయాన్ని సైతం తాకట్టుపెట్టారని అన్నారు. పైగా ఈ విషయాన్ని సమర్థించుకోవడం సిగ్గుమాలిన చర్యన్నారు. అమరావతిలో గ్రాఫిక్స్ తప్ప భవనాలు లేవంటూ ఆరోపించిన వారు అదే భవనాలను తనఖా పెట్టి అప్పులు ఎలా తెచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఒక్కొక్కరిపై ఇప్పటికే రూ.2.04 అప్పులు మోపడమే కాకుండా పుట్టబోయే బిడ్డలపైనా రుణభారం వేశారని అన్నారు.

శాస్త్రీయ ఆలోచన విధానాన్ని అలవర్చాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

చిన్ననాటి నుండే శాస్త్రీయ ఆలోచన విధానం, కళాచైతన్యం అలవర్చుకోవాలని ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి కోరారు. గురువారం మండలంలోని తాళ్లూరులో జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం, ఘంటసాల చైతన్య వేదిక, ఊరూరా జనవిజ్ఞానం సంయుక్త ఆధ్వర్యంలో ఎంపీపీఎస్ పాఠశాలలో ఊరూరా జనవిజ్ఞానం కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం కొల్లా గాయత్రి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పరిసరాల విజ్ఞానం నుండి, శాస్త్రీయ ఆలోచన పెంచుకోవాలని, అభ్యుదయ భావాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మూఢ నమ్మకాలను వదిలి వేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏవీ సతీష్ కుమార్, రమేష్‌బాబు, చంద్రయ్య, సులోచన, హిమని, సునీత పాల్గొన్నారు.

అవమానాలు ఎదురైనా ముందుకెళ్తున్న మహిళలు

విఠంరాజుపల్లెలో మక్కెన మల్లికార్జునరావు దంపతులను సత్కరిస్తున్న జీవీ ఆంజనేయులు దంపతులు

ప్రజాశక్తి - వినుకొండ

అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ మహిళలు చరిత్ర సృష్టిస్తున్నారని, అవమానాలు ఎదురైనా, అవకాశాలు పరిమితమే అయినా ముందంజలో దూసుకెళ్తున్నారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విఠంరాజుపల్లి వద్ద గెస్ట్‌హౌస్‌లో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు జీవీ ఆంజనేయులు ఆయన భార్య లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కన మల్లికార్జునరావు, భార్య పద్మావతి, జనసేన మహిళా విభాగ నాయకులు పాల్గొన్నారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ మహిళల జీవితాలను మార్చేందుకు టిడిపి-జనసేన సంయుక్తంగా మహాశక్తి పథకం రూపొందించిందని చెప్పారు. మహిళల జీవితాలను రోడ్డున పడేసేలా వైసిపి ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం అమ్ముతోందని, మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతి మూడు గంటలకు ఒక మహిళపై దాడి, ఎనిమిది గంటలకు ఒక అత్యాచారం జరుగుతోందని ఆవేదన వెలిబుచ్చారు. టిడిపి ప్రభుత్వంలో మహిళల రక్షణ కోసం తెచ్చిన ఫోర్త్ లయన్ యాప్‌ను దిశా యాప్‌గా మార్చారే తప్ప ఉపయోగమేమీ లేదన్నారు. అనంతరం మహిళలను ఘనంగా సన్మానించారు. జనసేన నాయకులు కె.రజిని, సినీ దర్శకురాలు ఎం.సౌజన్య, టిడిపి నాయకులు జి.రాజ్యలక్ష్మి, డి.ఉదయశ్రీ, శావల్యాపురం, నూజెండ్ల జెడ్‌పిటిసిలు పి.హైమావతి, జె.సుబ్బులు రామయ్య, కౌన్సిలర్ పి.అంజలిదేవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక తిరుమల ఇంజినీరింగ్ కాలేజీలో మహిళా దినోత్సవం నిర్వహించగా ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి నారాయణ, కన్వీనర్ సిహెచ్‌ఎల్ పద్మావతి, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ అరుణ మాట్లాడారు. ప్రతి ఒక్క మహిళ ఆత్మవిశ్వాసం పెంపొందించుకొని సొంత నిర్ణయాలు తీసుకునే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు.

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజీలో 'సమాజంలో మహిళల పాత్ర, మహిళలపై వేధింపులు' అంశంపై సదస్సు నిర్వహించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లలిత హాస్పిటల్ ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ నాదెండ్ల చంద్రహాస్, వికాస్ హాస్పిటల్స్ అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ కె.కనకదుర్గ ముఖ్య అతిథులుగా హాజరై స్త్రీ సమానత్వం, సమాజంలో మహిళల హక్కులు, బాధ్యత తదితర విషయాలపై మాట్లాడారు. అనంతరం వక్తృత్వం, పాటలు, డ్యాన్స్, క్విజ్ మొదలైన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు అతిథులకు సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

నారాకోడూరులోని జెడ్‌పి పాఠశాలలో హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు అధ్యక్షతన సభ నిర్వహించారు. క్విజ్, వ్యాసరచన, సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణిచ్చి జిల్లాస్థాయిలో విజయం సాధించేలా చేసిన సాంఘికశాస్త్రం ఉపాధ్యాయిని బి.కోటిపద్మ సత్కరించారు.

ప్రజాశక్తి - మంగళగిరి

ఏపీఎస్పీలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కేక్‌ను ఏపీఎస్పీ డీఐజి బి.రాజకుమారి కట్ చేశారు. బెటాలియన్ కమాండెంట్ వి.రత్న, అసిస్టెంట్ కమాండెంట్ రామకృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఎఎస్ఎన్ ఫార్మసి కళాశాలలో ఐపిఎఎస్‌ఎఫ్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా

నిర్వహించారు. మహిళా సిబ్బందికి క్యారమ్స్, బాడ్మింటన్, పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించి విజేతలకు కళాశాల ప్రిన్సిపల్, అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.వెంకటరమణ బహుమతులు ప్రదానం చేశారు. కుటుంబ వ్యవస్థలో ఆమె తల్లిగా, చెల్లిగా, అక్కగా, భార్యగా, అత్తగా ఇలా ఎన్నో బాధ్యతలు ఎంతో సమర్ధవంతంగా నిర్వహిస్తారని మహిళలను కొనియాడారు. ఐపిఎఎస్‌ఎఫ్ విభాగం, మెంటార్స్ అసోసియేషన్ ప్రొఫెసర్ వై.ఫణికృష్ణ, వి.భార్గవి, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళి అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి కార్యాలయంలో ఉద్యోగినులను సత్కరించారు. పైరు నాటిన దగ్గర నుండి పంట చేతికి వచ్చే వరకు మహిళల పాత్ర ఎంతో చాలా కీలకమన్నారు. అయినా మహిళలు వివక్షను ఎదుర్కొంటున్నారని, వారు అన్ని రంగాల్లోనూ మరింతగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యాలయ సహాయ వ్యవసాయ సంచాలకులు సి.హెచ్.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్లో లైన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిపారు. కార్యక్రమానికి హెచ్‌ఎం జి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. పాఠశాలలోని 12 మంది ఉపాధ్యాయినులను, ఇద్దరు మహిళా కార్మికులను సన్మానించారు. క్లబ్ నిర్వాహకులు మాట్లాడుతూ 2024 వేగవంతమైన మహిళాభివృద్ధి సాధిస్తారని ఐక్యరాజ్యసమితి తెలిపిందని అన్నారు. క్లబ్ సెక్రటరీ కె.ఉమామహేశ్వరరావు, లైన్ ఎం.జవహర్లాల్, పూర్ణ వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం కమిటీ సభ్యులు కె.జోజప్ప, ఉపాధ్యాయినులు డివి రమణమ్మ, జ్ఞానజ్యోతి, కె.పద్మావతి, శివకుమారి, కె.ఉమాదేవి, పి.విజయ్ కుమారి, పి.సుజాత, అరుణ, కార్మికురాలు కోటమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ డాక్టర్ సునీత అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. డాక్టర్ శారద, వివిఎస్ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎ.రాజేశ్వరి, సీనియర్ ఆటోకేట్ కెఎస్‌వి అంజని కుమారి ముఖ్య అతిథులుగా హాజయ్యారు. అంగన్వాడి కార్యకర్తగా విరమణ చేసిన వై.ప్రేమకుమారి, ఉత్తమ సేవలు అందించిన అత్తోటకు చెందిన సిహెచ్ ధనలక్ష్మి, హెచ్ లక్ష్మి కుమారిని సత్కరించారు.

ట్యాలెంట్ టెస్ట్‌లో సాయివికాస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పదో తరగతి విద్యార్థులకు విజయవాడలోని శస్త్ర ఇంటర్మీడియడ్ కాలేజీ జనవరి 18న నిర్వహించిన ట్యాలెంట్ టెస్ట్‌లో చిలకలూరిపేటలోని సుబ్బయ్యతోటలో గల సాయివికాస్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని డైరెక్టర్ నరిశెట్టి విరాస్వామి గురువారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 702 మంది పరీక్షలకు హాజరవగా, తమ పాఠశాల నుండి నలుగురు పాల్గొన్నారని చెప్పారు. తమ విద్యార్థి పి.లోకేశ్ రాష్ట్రస్థాయిలో 4వ స్థానంలో నిలిచి రూ.30 వేల నగదు బహుమతి గెలిచినట్లు తెలిపారు. దీంతోపాటు శస్త్రకాలేజీలో ఇంటర్ చేరితే చదివితే ఈ విద్యార్థికి 75 శాతం ఫీజు రాయితీ ఉంటుందన్నారు. సి.హెచ్. జోగేంద్ర సాయి నూరుశాతం, డి.చంద్రశేఖర్ 50 శాతం, పి.భార్గవ్ కృష్ణారెడ్డి 50 శాతం ఫీజు రాయితీకి అర్హత సాధించినట్లు చెప్పారు. విద్యార్థులు ఇంతటి ప్రతిభ చూపడంలో పాఠశాల ఉపాధ్యాయుల బృందం తోడ్పాటును అభినందించారు. ఇకమీదట ఐఐటి ప్రోగ్రామ్ పై ఆరవ తరగతి నుంచే అవగాహన, జెఇఇ మెయిన్, జెఇఇ అడ్వాన్స్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని అన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎం.సాయిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులిస్తున్న డైరెక్టర్

ఆకాశమే హద్దుగా... అన్నిరంగాల్లో రాణిస్తాం

మహిళల అభ్యున్నతితోనే సమాజాభివృద్ధి చెందుతుంది. ఆకాశమే హద్దుగా మహిళలు రాణిస్తున్నారు. అయినప్పటికీ సమాజం నుండి మరింత ప్రోత్సాహం ఉండాలని మహిళలు తెలుపుతున్నారు. ఎన్నికల వేళ మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని, మహిళా సాధికారతకు అందరూ కృషి చేయాలని కోరుతున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలు, అధికారులు తమ మనోభావాలను ప్రజాశక్తితో పంచుకున్నారు.

పాలకులు చెప్పేదొకటి.. చేసేది ఒకటి

ఎల్.అరుణ, ఐద్వా గుంటూరు జిల్లా కార్యదర్శి

మహిళా సాధికారత విషయంలో కేంద్రంలో, రాష్ట్రంలో పాలకులు చెబుతున్నది ఒకటి, చేస్తున్నది మరొకటిగా ఉంది. ఓట్ల కోసం ఏళ్ల తరబడి మహిళా సాధికారిత హామీలు గుప్పిస్తున్నా అవి అమలుకు నోచుకోవట్లేదు. మద్యం అమ్మకాలు పెంచటం ద్వారా మహిళా సాధికారత ఎలా సాధ్యం అవుతుందో ప్రభుత్వాలు చెప్పాలి. ఒకే రకమైన పనిలో ఉన్న స్త్రీ, పురుషులకు ఇప్పటికీ వేతనాల్లో తేడాలు కొనసాగుతున్నాయి. మహిళలు ఉన్నత విద్యలో వెనుకబడి ఉన్నారు. సమాజంలో అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా అభివృద్ధి చెందుతున్నా మహిళల పట్ల గౌరవం లేదు. పాలకులే అనేక సందర్భాల్లో మహిళల పట్ల అగౌరవంగా మాట్లాడటం భావి తరాలకు తప్పుడు సంకేతాలను ఇస్తుంది. మహిళల పట్ల, వారి అభివృద్ధి పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి అవసరం. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

మహిళల అభ్యున్నతితోనే సమాజాభివృద్ధి

బి.ఆదిలక్ష్మి, యుటిఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు

మహిళల అభ్యున్నతే సమాజ పురోగతికి మూలం. మహిళల భాగస్వామ్యం రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో పెరగాలి. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశం అమలుకు నోచుకోలేదు. రోజురోజుకూ మహిళలపై, బాలికలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో చట్టాలు పటిష్టంగా రూపొందించి, అమలు చేయాల్సిన అవసరం ఉంది. కుటుంబాల్లో మహిళల పట్ల, బాలికల పట్ల ఇతర కుటుంబ సభ్యుల ఆలోచనా విధానంలో మార్పు రావాలి.ఏ కుటుంబంలో నిర్ణయాల్లో మహిళల భాగస్వామ్యం ఉంటుందో ఆ కుటుంబాలు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తాయి. మహిళలు ఉత్పత్తిలో భాగస్వామ్యం కావటానికి ప్రధాన ఆటంకం వంట, ఇంటిపని. కాబట్టి ప్రభుత్వం సామాజిక వంటశాలలు ఏర్పాటు చేయటం ద్వారా మహిళలను దేశాభివృద్ధిలో భాగస్వాముల్ని చేసే అవకాశాలు పెరుగుతాయి. స్త్రీల శక్తికి తగిన విధంగా అవకాశాలు కల్పించే ఆర్థిక విధానాలు రూపొందించాలి.

ఎన్నికల హామీగానే మద్య నియంత్రణ

గుంటుపల్లి రజిని, ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి.

మద్యాన్ని పూర్తిగా నియంత్రించాలి. మద్యం వల్ల పేద వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. పురుషులు, ముఖ్యంగా యువకులు కూడా మద్యానికి అలవాటు పడుతున్నారు. దీని వల్ల కుటుంబాల్లో భార్యాభర్తల మధ్య విభేదాలు, గొడవలు పెరుగుతున్నాయి. ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయి. మద్య నియంత్రణ ఎన్నికల హామీలకే పరిమితం అవుతుంది. ఎన్నికల్లో గెలిచాక మద్యాన్ని ఆదాయ వనరుగా ప్రభుత్వాలు చూస్తున్నాయి. మద్యం వల్లే మహిళలపై దాడులు పెరుగుతున్నాయి. మహిళలను ఓటు బ్యాంకు కోసమే ఉపయోగించుకుంటున్నారు. లైంగిక వేధింపుల కేసుల్లోనూ నిందితులకు శిక్షలు సరిగా పడట్లేదు. దాడులు, వేధింపులు కేసుల్లో రాజీధోరణి పెరుగుతుంది. మహిళలపై జరిగే హింసను అరికట్టటానికి చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. మహిళలు ఎక్కువగా శ్రమ దోపిడీకి గురుతున్నారు.

ప్రజాశక్తి - గుంటూరు

రేపు వర్సిటీలో సినీనటి రాధికకు విశిష్ట మహిళా పురస్కార ప్రదానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు : అలనాటి తెలుగు, తమిళ చలనచిత్ర ప్రముఖ కథానాయిక రాధిక శరత్ కుమార్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 2024 విశిష్ట మహిళ పురస్కారాన్ని ప్రధానం చేయనుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 9న మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ తెలిపారు. ఈ వేడుకల్లో రాధికను సన్మానించి విశిష్ట మహిళ పురస్కారం ప్రధానం చేస్తామని పేర్కొన్నారు. తెలుగు, తమిళ భాషల్లో పరిచయం అక్కర్లేని పేరు రాధిక అని, తెలుగులో 1980లో చిలిపి వయసు చిత్రం ద్వారా సినిమా పరిశ్రమకు పరిచయమైన ఆమె 2023 వరకు 83 చిత్రాల్లో నటించిందని తెలిపారు. అగ్ర హీరోలు ఎన్టీఆర్, ఎఎన్ఆర్, శోభన్ బాబు, కృష్ణ, చిరంజీవి, వెంకటేష్ వంటి వారితో హీరోయిన్‌గా నటించిందని, తమిళనాడుకు చెందిన ఈమె ప్రస్తుతం సినిమాలలో తల్లి క్యారెక్టర్ తో పాటు బుల్లితెరలో వస్తున్న తెలుగు, తమిళ ధారావాహికలను నిర్మించి, నటిస్తుందని తెలిపారు.

మహిళా ప్రజా ప్రతినిధులపై షాడోల ప్రభావం తగ్గాలి

వి.స్వరూపరాణి, డివిజనల్ పంచాయతీ అధికారి, తెనాలి

ప్రజాశక్తి-తెనాలి

రాజ్యాంగబద్ధంగా అమలౌతున్న మహిళా రిజర్వేషన్లను మహి ళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ప్రజా ప్రతినిధులుగానో, అధికారులుగానో ప్రజాస్వామ్యంలో వివిధ హోదాల్లో మహిళలు ముందున్నారు. ఇది ఎంతో హర్షించదగ్గ పరిణామం. కాని వారిలో అధిక శాతం స్వతంత్రంగా వ్యవహరించలేకపోతున్నారు. ఎందుకంటే వారిపై షాడోల ప్రభావం ఉంటుంది. అది కుటుంబం, రాజకీయ పరంగానో వారిపై పురుషుల అజమాయిషీ ఉంటుందన్నది బహిరంగ రహస్యం. వీటిని అధిగమించాలంటే మహిళల్లో వ్యక్తిత్వ వికాసం ఉండాలి. కేవలం పది శాతం మంది మాత్రమే ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. అంది వచ్చిన అవకాశాలను మహిళలు అన్ని రకాలుగా సద్వినియోగం చేసుకుంటేనే మహిళా రిజర్వేషన్లకు సాధికారత లభిస్తుంది.

మహిళలపై దాడులు ఆందోళనకరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మహిళలు ఇంకా అన్ని రంగాల్లో రాణిస్తూ మరింత ముందుకు వెళ్లాలని చిన్న పిల్లల వైద్య నిపుణురాలు (హన్విత హాస్పిటల్) డాక్టర్ పచ్చవ విజేత(పావులూరి) అన్నారు. మహిళలు అన్ని రంగాలలో రాణించినప్పుడే సమానత్వాన్ని పొందుతారని మహిళను ఆది శక్తిగా కొలుస్తారని అన్నారు. కానీ ప్రస్తుతం మహిళల పట్ల జరుగుతున్న దాడులు మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల దశ నుండి స్త్రీల పట్ల గౌరవం కలిగేలా మర్యాదపూర్వకంగా మెలిగేలా విద్యా బోధన ఉండాలి. స్త్రీని గౌరవించినప్పుడే సమాజం బాగుపడుతుందనే నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు మహిళలలో అక్షరాస్యత శాతం పెరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని ప్రచార కార్యాక్రమాలు నిర్వహించాలి. ఆడపిల్లల పెంపకంపై తల్లిదండ్రులకు పాలకులు అవగాహన కల్పించాలి.

గ్రామాభివృద్ధే లక్ష్యం

భవనం నాగేంద్రమ్మ, సర్పంచ్, అల్లూరివారి పాలెం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి , భర్త నర్సిరెడ్డి ప్రోత్సాహంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు నరసరావుపేట మండలం అల్లూరివారిపాలెం గ్రామ సర్పంచ్ భవనం నాగేంద్రమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆమె శుభాకాంక్షలు తెలిపి మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ఆడ మగ అనే తేడా లేకుండా మహిళలు విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ తదితర రంగాలలో రాణిస్తున్న నేపథ్యంలో మహిళలను ఇంకా ప్రోత్సహించాల్సిన ఆవశ్యకతను ఆమె వివరించారు. గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం నిర్మించామన్నారు. రూ 36 లక్షల తో నాడు నేడు పథకం కింద గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.

రూ 50 లక్షలతో డ్రైనేజీ వ్యవస్థ, రూ 48 లక్షలతో జల్ జీవన్ మిషన్ పథకం కింద గ్రామంలో తాగునీరు సరఫరాకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామంలో కుల మతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడం పట్ల తనకెంతో సంతృప్తినిచ్చిందని చెప్పారు. మహిళలు విజ్ఞానవంతులు అయినప్పుడే ఆత్మవిశ్వాశం పెరుగుతుందని తద్వారా అన్నిరంగాలలో రాణించవచ్చంటూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మరోసారి మహిళలకు శుభాకాంక్షలు చెబుతూ ముగించారు.

ఆడబిడ్డ పుడితే సంబరాలు చేసుకోవాలి

కె ఆర్ కల్పశ్రీ, పల్నాడు జిల్లా ట్రైనీ కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతి ఆడపిల్ల లేదా మహిళ జీవితంలో స్థిరపడాలంటే వారు చదువుకుంటేనే సాధ్యమవుతుందని పల్నాడు జిల్లా ట్రైన్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ అన్నారు. తమ స్వగ్రామం కర్ణాటక రాష్ట్రం తుంకూర్ అని పేర్కొన్నారు. ఐ.ఎ.ఎస్ సాధనకు 3 పర్యాయాలు ప్రయత్నించి నిరాశ చెందిన సమయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువ లేనిదన్నారు. ఐ.ఏ.ఎస్ లక్ష్య సాధనలో ఉండగా తనను నిరాశ పరిచిన వారే భుజం తట్టి మెచ్చుకునేలా పట్టుదలతో 2022లో 4వ సారి ఐ.ఏ.ఎస్ సాధించడం జరిగిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆమె మహిళా లోకానికి ప్రజాశక్తి ద్వారా తన సందేశాన్ని అందజేశారు. నేటి ఆధునిక యుగంలో ఆడపిల్లను ఎవరు కూడా భారంగా భావించాల్సిన అవసరం లేకుండా మహిళలు అన్ని రంగాలలో పురుషులకు దీటుగా రాణిస్తున్నారన్నారు. ఇంట ఆడపిల్ల పుడితే సంబరాలు చేసు కోవాలని ఆమె సూచించారు. నేడు మహిళలకు పురుషులతో పాటు అన్ని రంగాలలో రాణిస్తున్న నేపథ్యంలో సమాన అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. కేంద్రం ప్రభుత్వం కూడా మహిళల పట్ల వివక్షను రూపుమాపేందుకు 30 వరకు ఆడపిల్లలకు సంబంధించిన అనేక పథకాలను ప్రవేశ పెట్టారన్నారు

ఆకాశమే హద్దుగా రాణించాలి

డాక్టర్ కె హెలెన్ నిర్మల, మున్సిపల్ హెల్తాఫీసర్, తెనాలి.

ప్రజాశక్తి తెనాలి

నేటి సమాజంలో మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, క్రీడలు ఇలా ఒకటేమిటి.. అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. రాణించాలి కూడా. అదే సమయంలో ఇంటి బాధ్యతలు నిర్వహించడంలో కూడా ఓర్పు, నేర్పు మహిళలకే సాధ్యం. ఓవైపు గహిణిగా బాధ్యతలు నిర్వహిస్తూనే సమాజంలో కూడా తన వంతు బాధ్యతగా వ్యవహరించాలి. మహిళలంటే చిన్నచూపు అన్న ఆత్మ న్యూనతా భావం నుంచి ప్రతి మహిళ బయటకు రావాలి. ముఖ్యంగా నేటి పరిస్థితులకు దీటుగా స్వశక్తితో ఎదగాలి. ఎంతటి విపత్కర పరిస్థితులైనా అధిగమించే మానసిక స్థైర్యం కలిగి ఉండాలి. భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అన్ని హక్కులను కాపాడుకుంటూ ఆకాశమే హద్దుగా మహిళలు ఎదగాలి.

కవితలు

జీవన వాహిని

అబల ఆడదనుచు అవహేళ నెందుకు
ఇంతి చక్కబెట్టు ఇంటి నంత
ఇంటి వెలుగు యన్న ఇంతియే నిజముగా
మదిన నిల్పు కొనుచు మసలుకొనుము
పుడమి వంటి ఓర్పు పుత్తడి బొమ్మకున్
అవని యందు లేదు అతివ నేర్పు
మగువ తెగువ చూడ మరిసాటి ఎవ్వరున్
పూజనీయురాలు పుడమి పైన
అంబుజాక్షి ఎక్కె అంతరిక్ష మెపుడొ
అంత ఇంత గాదు ఆమె బలము
తరుణి మాట వినిన తథ్యము విజయము
నడుచు కొనుము ఎరిగి నాతి మనసు
కోమలాంగి మనసు కోమలమ్ము నిజము
కరిగి పోవు నెపుడు కరుణ జూపి
చెలిమి జేసి వీవు చెడు తలపోయకూ
మంచి చూపు తోను మంచి సేయు

అనిల్ కుమార్ దార్వేముల
ఫోన్ 99512 44718

ఆమె సేవలకేది విలువ

ఆకాశం సగం అలిగింది
చుక్కల దుప్పటి చుట్టేసి
కటిక నేలమీద పడకేసింది
నెల నెలా వెన్నెల ఏమోకానీ
రక్త సిక్త మవుతున్న రవికల కష్టం
మాగాణి గట్టుమీద చీరలే
మౌనంగా విమానంలో వారలే
మెరికల్లా పనిచేసినా మరకలు
అరమరికలు లేకున్నా చురకలే
మచ్చలేని జాబిలేది ?
ఎంచలేని యెనలేని సేవల గుర్తింపేది?
పుత్తడి బొమ్మలు పుట్టగానే పోతుంటే
చిత్తడి నేలలు విత్తకనే పడుంటే
నింగి వంగి తొంగి చూస్తోంది
కుంగి కుంగి వంగి పోతోంది
కన్నతల్లి వెన్ను విరిగి వంగింది
వెన్నలాంటి ప్రేమ మంచులా కరిగింది
తోడేళ్ళ పున్నమి కూడళ్లలో వెలిగింది
ఆకాశంలో సగం ఆడ అలిగింది

డాక్టర్ రమణ యశస్వి
ఫోన్98480 78807

అద్దంకి రోడ్డు నిర్మించాలని పోస్ట్‌కార్డులతో వినతి

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ నుండి అద్దంకి వెళ్ళు రోడ్డు గుంతల మయమై అధ్వానంగా తయారైందని వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నక్క రమణారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం యువకులు 'సిఎంకు పోస్ట్ కార్డు' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ పెద్ద కంచర్ల కాలనీ , గోనుగుంట్లవారిపాలెం, ఏనుగుపాలెం గ్రామాల్లో ని రోడ్లపై గుంతలు చాలా ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేదని చెప్పారు. ఆ రోడ్డు పరిధిలోని గ్రామ ప్రజలతో ముఖ్యమంత్రికి 300 ఉత్తరాలు, ప్రధానమంత్రికి 200 ఉత్తరాలు రాసి గురువారం వాటిని పోస్ట్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దావులూరి వీరాంజి, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ ప్రోగ్రాం కమిటీ సభ్యులు యాదాల వెంకటేష్ , అలిశెట్టి రంగనాయకులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్ స్పందించాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

అనంతపురం జిల్లా రాప్తాడులో పార్టీ నాయకులపై దాడి, గుడిసెలను తగలబెట్టిన ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి అనుచరులపై చర్యలు తీసుకునేలా మానవ హక్కుల కమిషన్ వెంటనే స్పందించాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ(జేబీపీ) సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ డిమాండ్. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని 25వ వార్డ్ జాగుపాలెంకు చెందిన యానాది కాలిని లో యటగిరి వెంకాయమ్మ(68) గురువారం నాడు ఉదయం మృతిచెందారు.ఈ విషయం తెలుసుకున్న జనసేన యువనాయకులు ఎం.చరణ్ తేజ, మృతురాలి కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో టి.మల్లికార్జున రావు, ఎం.ప్రసాద్, ఎం. శంకర్, ఎన్.దుర్గా, ఎస్.శబరి, పి.బాలు పాల్గొన్నారు.

సాగర మాత ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో సాగర మాత మహెూత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాగరమాత మహోత్సవాలను పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో గోరంట్ల గురుశ్రీ గోపు జోసఫ్ ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో విజయపురిసౌత్ కళకళలాడింది. స్థానిక లాంచీస్టేషన్ సెంటర్ నుంచి సాగరమాత దేవాలయం వరకు రోడ్డుకు ఇరువైపుల తినుబండారాల కేంద్రాలు,ఫ్యాన్సీషాపులు, వివిధ రకాలైన ఆటబొమ్మల షాపులు వెలిశాయి. సాగరమాత ప్రాంగణంలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్, రంగుల రాట్నాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాగరమాత దేవాలయానికి వచ్చే భక్తుల కోసం వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.సమద్ధి ఫౌండేషన్ స్థానిక కెనరా బ్యాంక్ ల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

పోలీసు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న గుంటూరు రేంజ్ ఐజి పాలరాజు, ఎస్పీవై రవిశంకర్ రెడ్డి, బందోబస్తుకు హాజరైన సిబ్బంది

కోటప్పకొండ తిరునాళ్ళ ఉత్సవాలకు

3,000 మంది పోలీసులతో బందోబస్తు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సందర్శకులు ప్రశాంత వాతావరణంలో త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకునే విధంగా విధులు నిర్వర్తించాలని గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, పల్నాడు జిల్లా ఎస్పీ వై. రవిశంకర్ రెడ్డి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కోటప్ప కొండ తిరునాళ్ళ ఉత్సవాలకు బందోబస్తు నిర్వహించడానికి హాజరైన 3 వేల మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి కోటప్పకొండలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బందోబస్తు విధులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐజి, ఎస్పీ మాట్లాడుతూ మాట్లాడుతూ కోటప్పకొండ తిరునాళ్ళ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చేయాల్సిన అన్ని ఏర్పాట్ల గురించి పోలీస్ అధికారులతో సమీక్షలు నిర్వహించి,పటిష్ఠ ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. కోటప్పకొండ తిరునాళ్ళ ఉత్సవాలలో 3 వేల మంది పోలీస్ బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సందర్శకులతో సున్నితంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా రూపొందించిన కోటప్పకొండ పార్కింగ్ యాప్ గురించి ప్రజలకు వివరిస్తూ, నిర్ణీత ప్రదేశాలలో నిలుపుకోవడానికి దిశా నిర్దేశం చేసినట్లు చెప్పారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాల వద్ద,ప్రభల ప్రదర్శన ప్రాంతాల్లో, దర్శన సమయంలో జన సందోహం స్తంభించకుండా తగిన చర్యలు తీసుకున్నామని, ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవకుండా పోలీస్ అధికారులు ,సిబ్బంది విధులు నిర్వర్తించాలని అన్నారు. కార్య క్రమంలో అదనపు ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, ఎఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు, డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

నిర్దేశించిన సమయంలోగా కార్యక్రమాలు ముగించాలి

నిర్వాహకులు నిర్దేశించిన సమయానికి ప్రభను కోటప్పకొండకు తీసుకురావాలని నిర్దేశించిన సమయం అనంతరం అను మతించబోమని ఐజి, ఎస్పీ చెప్పారు ప్రభలపై ఎటువంటి రాజకీయ కార్యక్రమాలు కార్యకలాపాలు సాగించరాదని, నిర్దేశించిన సమయంలో గా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ముగించాలని అశ్లీల నృత్యాలు చేయరాదని హెచ్చరించారు. ప్రతి ప్రభ వద్ద పోలీసు సిబ్బంది నిఘా ఉంటుందన్నారు.

'ఆత్మీయ పలకరింపు ముఖ్యం'

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

మరో నలభై రోజుల్లో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రతి ఒక్క టిడిపి నాయుకుడు ప్రజలతో మమేకమై ప్రతి ఒక్కరిని ఆత్మీయతో పలకరించాలని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణం లోని జానపాడు రోడ్డులోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో గురువారం క్లస్టర్,యూనిట్,బూత్ ఇన్ చార్జ్‌లు, బూత్ కన్వీనర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు 'సూపర్ సిక్స్' లాగా గురజాల నియో జకవర్గంలో ప్రత్యేకంగా 'సూపర్ సిక్స్' ఏర్పాటు చేస్తామని చెప్పారు. గురజాల కేంద్రంగా పల్నాడు జిల్లా ఏర్పాటు చేస్తామని, బాబు సూపర్ సిక్స్‌లో మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తారని, గురజాల నియోజకవర్గంలో మాత్రం మరో సిలిండర్ ఉచి తంగా ఇస్తామని, చంద్రన్న బీమాకు నియోజకవర్గంలో ఉన్న లక్ష యాభైవేల మందికి చెల్లించాల్సిన ప్రీమియం ఉచితంగా తామే చెల్లి స్తామని, నియోజకవర్గంలోని ముస్లింలు హజ్‌కు వెళ్ళేందుకు లక్ష రూపాయిలు అంది స్తామని, మాలలు ధరించిన క్రిష్టియన్ సోదరులకు వేళంగిణి వెళ్ళేందుకు ఉచితంగా బస్సులు ఏర్పాటు చేస్తామని, నియోజకవర్గంలో ఉన్న 15 వేల మంది నిరుద్యోగులకు జాబ్ మేళాలు ఏర్పాటు చేసి ఉద్యోగ కల్పిస్తామని వివరించారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు ఎమ్మెల్యేకు సవాల్

ప్రజాశక్తి - వినుకొండ

మాట్లాడుతున్న జివి ఆంజనేయులు, చిత్రంలో మక్కెన మల్లికార్జునరావు తదితరులు

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నెంబర్-1 చీటర్ అని, టిడిపి పాలనలో నిలిచిపోయిన పనులు చేసి అన్ని తానే చేస్తున్నట్టు తప్పుడు ప్రచారం చేస్తు న్నారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు విమర్శించారు. ఆంజనేయులు తన నివా సంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఐదేళ్లలో వినుకొండ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేని అసమర్ధ ఎమ్మెల్యే వినుకొండ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. తమ హయాంలో జరిగిన అబివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని, దమ్ముంటే ఎమ్మెల్యే చర్చకు రావాలని సవాల్ విసిరారు. మూగచింతల పాలెం డీప్ కట్ నుండి పైప్లైన్ వేసి చెరువులు నింపి తాగునీరు సరఫరాకు రూ.12 కోట్లు నిధులు ఇస్తానని సీఎం ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చలేదన్నారు. దొండపాడు నుంచి కలుషిత నీటిని విను కొండకు సరఫరా చేయడం దారుణమని అన్నారు. శివశక్తి లీల అండ్ అంజన ఫౌండేషన్‌పై ఎమ్మెల్యే విమర్శలు, తిరుమల డైరీ లో జరిగిన కల్తీ పాలవిక్రయాలు, నాడు వందల కోట్లు విలువ చేసే ఎన్ఎస్‌పి స్థలాన్ని మున్సిపాలి టీకి అప్పగింత మొదలైన అంశాలపై మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు మాట్లాడుతూ వెన్నపూస కాలనీ సంఘట నపై ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలను ఖండించారు. కాట్రగడ్డ రాధాకృష్ణ, బిసి నరసింహారెడ్డి వారి భూములను లాక్కుంది ఎమ్మెల్యేనే అని ఆరోపించారు.

మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో ఫీడ్ పెట్టకూడదని, చట్ట విరుద్ధంగా అన్ని చెరువుల్లో వల్లభ ఫీడ్ అందించి కోట్లు కొల్లగొడుతోంది ఎమ్మె ల్యేనే అని ఆరోపించారు. సమావేశంలో టిడిపి నాయకులు పటాన్ అయూబ్ ఖాన్, షమీం ఖాన్, జగ్గారావు, గోవిందరాజులు పాల్గొన్నారు.

వైఎస్సార్ చేయూత

96,862 మంది లబ్ధిదారులకు రూ.181.61 కోట్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి, అభివద్ధి ని ప్రోత్సహిస్తూ, సామాజిక మరియు ఆర్థిక స్వావలంబన సాధికారతే లక్ష్యం గా సుస్థిరమైన జీవనోపాధి కల్పించటం ప్రధాన ధ్యేయం గా ప్రభుత్వం అందిస్తున్న కానుకే వైఎస్సార్ చేయూత అని జాయింట్ కలెక్టర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరుసగా 4వ ఏడాది వైఎస్సార్ చేయూత పథకం కింద

మెగా చెక్కు ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్ , ట్రైనీ కలెక్టర్

విడుదల చేసిన నిధులను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివద్ధి సాధించాలని జాయింట్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. గురువారం వైఎస్సార్ చేయూత పథకం కింద ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నరసరావుపేటలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు అనూష, డీఆర్డీఏ పిడి బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద పల్నాడు జిల్లాలో 96,862 మంది మహిళా లబ్ధిదారులకు రూ.181.61 కోట్ల చెక్కును లబ్ధిదారుల సమక్షంలో ఆవిష్కరించారు. 4 ఏళ్లలో పల్నాడు జిల్లాకు చేయూత పథకం కింద రూ 612.03 కోట్ల లబ్ది చేకూరిందన్నారు.

సత్తెనపల్లి మండలంలో బులెట్ పై పర్యటిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

10న 'సిద్ధం'కు సన్నద్ధం కావాలి: మంత్రి అంబటి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సిద్ధం మహాసభకు వైసిపి శ్రేణులు సన్నద్ధం కావాలని మంత్రి అంబటి రాంబాబు పిలుపిచ్చారు.సత్తెనపల్లి మండలంలోని నందిగామ, గుడిపూడి,లక్ష్మీపురం, ఫణిదం, భట్లూరు, కట్టమూరు, డిడిపాలెం, అబ్బూరు తదితర గ్రామాల్లో మంత్రి అంబటి రాంబాబు బులెట్ పై గురువారం పర్యటించారు. ద్విచక్రవాహనాల భారీ ర్యాలీతో అంబటి పర్యటించారు. మిర్చి కూలీలతో మమేకమయ్యారు. స్థానిక నేతలతో సమావేశ మయ్యారు . జగన్మోహన్ రెడ్డి పాలన గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. మార్చి 10న మేదరమెట్ల లో జరిగే సిద్ధం సభకు జనాన్ని సమీకరించాలని విజ్ఞప్తి చేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వినుకొండ

ప్రజా క్షేత్రంలో తేల్చుకునేందుకు తాను సిద్ధమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జున రావులు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. తాను చేసిన అభివృద్ధి పట్ల ప్రజలు ఎంతో నమ్మకంగా ఉన్నారని అన్నారు. అసభ్య పదజాలంతో వారు మాట్లాడటం వల్లే తాను మాట్లాడాల్సి వస్తోందని అన్నారు. తనపై జీవి ఆంజనేయులు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. పరుష పదజాలంతో దూషించడం సభ్యత కాదని, ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తిరిగి ఘాటుగా స్పందించడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు వెంకట రామిరెడ్డి, బత్తుల చిన్నబ్బాయి పాల్గొన్నారు.

11న ఐటిఐలో అప్రెంటీస్ మేళా

ప్రజాశక్తి తెనాలి :స్థానిక చినరావూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈనెల 11న అప్రెంటిస్/ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావి చిన వెంకటరమణ గురువారం తెలిపారు. ఐటిఐ లో ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రిషియన్, వెల్డర్ అర్హత కలిగిన వారు జాబ్ మేళాకు హాజరు కావచ్చునన్నారు. దాదాపు ప్రధానమైన పది కంపెనీల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొం టారని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హతలు, ఆధార్‌కార్డు ప్రతులతో ఉదయం 10 గంటలకు హాజరు కావాల్సిందిగా కోరారు. వివరాలకు 9014491772, 9959828100 నెంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

దీక్షను ప్రారంభిస్తున్న వై నేతాజీ

సమస్య పరిష్కారమయ్యే వరకూ దీక్షలు

ప్రజాశక్తి దుగ్గిరాల :నష్టపోయిన పసుపు రైతుల సమస్య పరిష్కారం అయ్యేంతవరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని సిఐటియు జిల్లా కార్యదర్శి వై నేతాజీ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గత ఏడు రోజుల నుండి కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించి సంఘీభావం తెలిపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు సిఐటియు మద్దతు తెలుపుతుందన్నారు. ప్రస్తుత ధర క్వింటా రూ.14 వేల రూపాయల ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పసుపు రైతు రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకర్ మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్ యజమాని బీమా కంపెనీకి అవసరమైన సర్టిఫికెట్లు మొత్తం ఇవ్వాలని కోరారు నష్టపోయిన రైతుల కమిటీ కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకుంటే సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించీ రోడ్డును దిగ్బంధం చేస్తామన్నారు. కార్యక్రమంలో కో కన్వీనర్ కాజ వెంకటేశ్వరవు ములక శివ సాంబి రెడ్డి జెట్టి బాలరాజు నాదెండ్ల చంద్రశేఖర్ డి వెంకట్ రెడ్డి నాగేశ్వరరెడ్డి నాగరాజు సీతారామయ్య బి అమ్మిరెడ్డి శ్రీనివాసరావు పోతురాజు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రేపు గుంటూరులో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాల పెంపునకు అధికారుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆమోదించి, వెంటనే జీతాలు పెంచాలని కోరుతూ ఈనెల 9న గుంటూరు యుటిఎఫ్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ది గుంటూరు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు తెలిపారు. గురువారం బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు ఏళ్ల తరబడి పెంచట్లేదన్నారు. ఇటీవల జరిగిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం వారి సమస్యపై ఒక కమిటీ నియమించిందన్నారు. ఆ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందన్నారు. అయితే ఆ నివేదికలో గార్డెనర్స్ వంటి కొన్ని విభాగాల కార్మికులకు తక్కువ వేతనాలు ప్రతిపాదించారని, కావున వాటిని సరిచేసి, అందరికీ వేతనాలు పెంచాలన్నారు. తమ యూనియన్ పలు అభ్యంతరాలు తెలియజేయటం జరిగిందన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సదస్సులో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో యూనియన్ ఇంజినీరింగ్ విభాగం కన్వీనర్ పి.శ్రీనివాసరావు, గాంధీ పార్కు కమిటీ సభ్యుడు పాశం పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

జిల్లాలో 93,275 మందికి చేయూత

ప్రజాశక్తి-గుంటూరు :మహిళలు సుస్థిర జీవనోపాదులు ఏర్పాటు చేసుకొని స్థిర ఆదాయం అర్జించాలన్న లక్ష్యంతో సిఎం జగన్‌మోహ న్‌రెడ్డి వైఎస్సార్ చేయుత ద్వారా ఆర్థిక సహాయం అంది స్తున్నారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన వైఎస్ఆర్ చేయూత నాల్గవ విడత నిధుల జమ కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యస్సీ, యస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలలో 45 సంవత్సరాల నుంచి 60 సంవత్సరముల మధ్య వయస్సు ఉన్న మహిళలకు ఆర్థికంగా నిలబడేందుక్ చేయూత పథకాన్ని 2020 ఆగస్టు 12 నుండి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఏటా రూ.18,750ల చొప్పున నాలుగేళ్ళ పాటు మొత్తం రూ.75,000లు ఆర్థిక సహాయం అందించటం జరిగిం దన్నారు. ప్రస్తుతం నాలుగో విడతలో 93,275 మందికి రూ.174.88 కోట్లు మంజూరు చేయటం జరుగుతుంద న్నారు. నాలుగు విడతల్లో కలిపి రూ. 708.15 కోట్లు ఆర్థిక సహాయం అందించినట్లు వివరించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కు అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పోరేషన్ ఛైర్మన్ మండేపూడి పురుషోత్తం, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు సహాయ కార్పోరేషన్ చైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్, రాష్ట్ర పూసల, కష్ణ బలిజ కార్పోరేషన్ చైర్ పర్సన్ కోలా భవానీ మణికంఠ, జిల్లా డీసీఎంఎస్ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

మెగా చెక్కు అందచేస్తున్న కలెక్టర్ తదితరులు

జగనన్న స్థలాలకు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

నివేశన స్థలాలు పంపిణి మొదలు కుని నేడు అదే నివేశాన స్థలాలకు శాశ్వత రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చెయడం గర్వంగా ఉందని తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ కమిటి యార్డు ప్రాంగణంలో గురువారం ఏర్పాటుచేసిన సభలో 9,183 మందికి సర్వ హక్కులతో భూ బదిలీ శాశ్వత పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక లోపాలతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తవ్వని పట్టాలను త్వరలో లబ్ధిదారులకు అందేలా ఏర్పాటు చేస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూఅక్కా, చెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు మంజూరు నుంచి రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ ప్రక్రియ అంతా పార దర్శకంగా జరిపామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్, వైస్ ఛైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట కృష్ణవేణి, కమిషనర్ బి శేషన్న తదితరులు పాల్గొన్నారు

స్థానిక సంస్థల్లో పదవులు కేటాయించాలి

ప్రజాశక్తి మంగళగిరి :మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నారా లోకేష్ కాపు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయింపుకు చర్యలు తీసుకోవాలని కాపు సంక్షేమ సేన (కే ఎస్ ఎస్) మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు తిరుమల శెట్టి కొండలరావు కోరారు. బుధవారం రాత్రి ఉండవల్లిలోని నివా సంలో తిరుమల శెట్టి కొండలరావు ఆధ్వర్యంలో కే ఎస్ ఎస్ నాయకులు నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ దృష్టికి తిరుమల శెట్టి పలు సమ స్యలు తీసుకుని వెళ్లారు. స్థానిక సంస్థల్లో కాపులకు పదవులను కేటాయించే విషయంలో ప్రాధాన్యత నివ్వాలని లోకేష్ ను కోరినట్లు కొండలరావు తెలిపారు. ఇందుకు లోకేష్ సాను కూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాపరౌతు సుందరయ్య, దుర్గా రావు, చిట్టెం అవినాష్, గుర్రాల మణికంఠ, శంకరశెట్టి బాబి, వీరిశెట్టి వెంకటేశ్వరరావు, బత్తిని అంజయ్య పాల్గొన్నారు.

నవరంగ కాంగ్రెస్‌పార్టీకి బక్కెట్ గుర్తు

ప్రజాశక్తి మంగళగిరి :వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఎస్సీ ,ఎస్టీ ,బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉండి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే నవరంగ్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ విజ్ఞప్తి చేశారు. మంగళగిరి నగరంలోని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జలీల్ మాట్లాడుతూ నవరంగ్ కాంగ్రెస్‌పార్టీకి ఎన్నికల కమిషన్ బక్కెట్ గుర్తు కేటాయించదని తెలిపారు.సమావేశంలో నవరంగ్‌పార్టీ నాయకులు సయ్యద్ సైదా, పఠాన్ ఉమర్‌ఖాన్, సయ్యద్ ఖమురున్నీసా, గుర్రం రామారావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌తో ధూళిపాళ్ల మీట్ అండ్ గ్రీట్

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ :పొన్నూరు పట్టణంలోని జడ్పీ హైస్కూల్ ఆవరణంలో గల ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి మెమోరియల్ స్టేడియం గ్రౌండ్‌లో వాకర్స్‌తో ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ స్కూల్ కమిటీతో పాటు స్టేడియం కమిటీ ఏర్పాటు చేసి స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చేశామన్నారు. ఎంపీ రావుల చంద్రశేఖరరెడ్డి నిధులతో నిర్మాణ పనులు కొనసాగాయని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి పర్యవేక్ష ణకు సిబ్బందిని నియమించామని తెలిపారు. ఓల్డ్‌స్టూడెంట్స్ సహకారంతో స్కూల్లో వేదిక ఏర్పాటు చేశామన్నారు.

గౌతమ్ బుద్ధ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి మంగళగిరి :గౌతమ్ బుద్ధ రోడ్డును గురువారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఏపీఐఐసీసీ కార్యా లయం సమీపంలో మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి విగ్రహాన్ని విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు ఆర్కే ఏం చేశారో చెప్పాలి?

ప్రజాశక్తి-తాడేపల్లి :మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నియోజకవర్గంలోని ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ఇటీవల టిడిపిలో చేరిన వైసిపి నాయకులు దొంతిరెడ్డి సాంబిరెడ్డి ప్రశ్నించారు. గురువారం తాడేపల్లి టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో తనపై వచ్చిన అబద్దపు ప్రచారాన్ని ఖండించారు. యు1 జోన్ విషయంలో వైసిపి రైతులను మోసం చేసిందని విమర్శించారు. తాము తాడేపల్లిలో సుమారు 130 రోజులు దీక్షలు చేస్తే కనీసం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బకింగ్ హోమ్ కెనాల్‌పై డబుల్ లైన్ బ్రిడ్జి నిర్మించలేకపోయారని అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వయానా ముఖ్యమంత్రి తాడేపల్లిలో నివాసం ఉంటూ ఆయన నివాస సమీపంలో ఉన్న సింగిల్ లైన్ బ్రిడ్జి డబుల్ లైన్ బ్రిడ్జిగా మార్పు చేయడానికి ఐదు సంవత్సరాలు సరిపోలేదా అని ప్రశ్నిం చారు. రాష్ట్రంలోనే అత్యంత పెద్దదయిన కార్పొరేషన్ అని చెప్పుకుంటున్న తాడేపల్లిలో శ్మశానం లేకపోవడం సిగ్గు చేట ని విమర్శించారు. సమావేశంలో టిడిపి నాయకులు వల్లభనేని వెంకట్రావు, డి.దాసు, ఎం.శ్రీధర్‌రెడ్డి, ఎం.సత్యనారా యణ, సిహెచ్.శ్రీనివాసరావు తదితరురలు పాల్గొన్నారు.

రాజకీయ కక్షలో భాగమే సోదాలు

ప్రజాశక్తి మంగళగిరి:జనసేన పార్టీ నివాసం ఉంటున్న కొండపనేని టవర్స్‌లో పోలీసులు అర్ధరాత్రి సోదాలు చేయడానికి రావడాన్ని జనసేన పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పి మహేష్, నాయ కులు అమ్మిశెట్టి వాసు, బి విజయశేఖర్ తదితరులు మీడి యాతో మాట్లాడారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయ సిబ్బంది ఉంటున్న అపార్ట్మెంట్ పై పోలీసులు జొరబడి సోదాలు చేయడానికి ప్రయత్నించారని, ఈక్రమంలో జనసేన రాష్ట్ర కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేసే అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌ను మహిళ అని కూడా చూడకుండా దౌర్జన్యంగా వ్యవహరించారన్నారు. విషయం తెలిసిన జనసైనికులు రావడంతో పోలీసులు వెనుతిరిగా రన్నారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. పవన్ కళ్యాణ్ వ్యక్తిగత సిబ్బంది పై ఇలా ప్రవర్తిస్తే తాము ఎదుర్కొంటా మని అన్నారు. ఇలాంటి కుట్రపూరిత చర్యలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాల్పడితే తాడేపల్లి సీఎం నివాసాన్ని జనసైనికులు ముట్టడిస్తారని హెచ్చరించారు.

'పది' విద్యార్థులకు అభినందన

ప్రత్తిపాడు :మండల పరిధిలోని చిన్న కొండ్రుపాడు జడ్పి హైస్కూల్లో గురువారం పదవ తరగతి విద్యార్థులను అభినందించి, చాగంటి మహాలక్ష్మి సహకారంతో దాతలు పరీక్షా సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో గడ్డిపాటి పద్మారాణి, పోతురాజు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

కృషి, పట్టుదలే విజయానికి సోపానాలు

ప్రజాశక్తి-గుంటూరు

కృషి పట్టుదలే విజయాలకు సోపానాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. గురువారం జైన్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ మొహమ్మద్ మున్ను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ జైన్ హైస్కూల్ విద్యార్థులు గతేడాది లాగే ఈ సంవత్సరం కూడా రాష్ట్రస్థాయి ఫలితాలు సాధించాలని ఆకాక్షించారు. పదో తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థికీ కీలకమని అన్నారు. మరో వారం రోజుల్లో పరీక్షలు ప్రారంభమవుతున్న దృష్ట్యా విద్యార్థులు సమిష్టి ప్రణాళికతో ముందుకు వెళ్లడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. మున్ను మాట్లాడుతూ తమ విద్యార్థులు పరీక్షా ఫలితాలతో పాటు క్రీడా సాంస్కృతిక రంగాల్లో కూడా అత్యుత్తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ డిఐ షేక్ ఖాసీం, స్కూల్ ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

కోల్డ్‌స్టోరేజ్ ప్రమాదంపై నివేదికివ్వండి

అగ్నిమాపక అధికారికి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-తెనాలి

దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ సోరేజిలో సంభవించిన అగ్నిప్రమాద నివేదిక అందించాలని ఏపి పసుపురైతుల సంఘం నాయకులు కోరారు. గురు వారం తెనాలిలో అగ్ని మాపక శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అగ్ని ప్రమాద బాధిత పసుపు రైతుల కమిటీ కన్వీనర్ వేము లపల్లి వెంకట్రామయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ములకా శివసాంబిరెడ్డి, నాయకులు నాదెళ్ళ చంద్రశేఖర్ మారీసు పేటలోని ది న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులతో రైతులకు రావాల్సిన బీమా గురించి చర్చించారు. రూ.115 కోట్ల విలువైన పసుపు దగ్ధం కావటానికి, రైతులు నష్టపోవటానికి కారణమైన కోల్డ్ స్టోరేజి యాజమాన్యంపై సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నాయకులు అన్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

కౌన్సెలింగ్ టెక్నిక్స్‌పై 16న వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులు ఒత్తిడి నుండి సోషల్ మీడియా ప్రభావం నుండి దూరంగా ఉంచేందుకు తగిన కౌన్సెలింగ్ టెక్నిక్స్ వివరించేందుకు ఈనెల 16న ఉపాధ్యాయలు, హాస్టల్ వార్డెన్లు, తల్లిదండ్రులకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఏఎల్ బి.ఇడి కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ యం.ఎస్తేర్ సునీల తెలిపారు. గురువారం స్థానిక లాడ్జి సెంటర్‌లోని కళాశాలలో వర్క్‌షాప్ బ్రోచర్‌ను అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇటీవల కాలంలో సోషల్ మీడియా బానిసలుగా మారుతున్నారని, ఆ ప్రభావాన్ని తగ్గించటానికి అవసరమైన టెక్నిక్స్ ఈ వర్క్‌షాప్‌లో వివరించటం జరుగుతుందన్నారు. స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు లేదని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ ఉంటుందన్నారు. కావున ఈ వర్క్‌షాప్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు. బ్రోచర్ ఆవిష్కరణలో డాక్టర్ ఎ.ఇన్నారెడ్డి, డాక్టర్ ఎస్.ఎ.వెస్లీ, శేఖర్, కిషర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో పి.వి.విగ్రహావిష్కరణ

పాల్గొన్న మంత్రి రజనీ, అప్పిరెడ్డి, కావటి, మద్దాలిగిరి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని పి.వి. నరసింహా రావు విగ్రహాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ ఆవిష్క రించారు. విగ్రహ కమిటీ చైర్మన్, కార్పొరేటర్ ఈచంపాటి ఆచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాలి గిరి, మేయర్ కావటి మనోహర్ నాయుడు, డిసిసిబి చైర్మన్ లాలుపురం రాము, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో పి.వి. నరసింహారావు పాత్ర శ్లాఘనీయమైందన్నారు. దిగువ స్థాయి నుంచి దేశ ప్రధాని స్థాయి వరకు అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడు పి.వి.అని కొనియాడారు.

దేశం కష్టకాలంలో ఉన్నప్పుడు పలు సంస్కరణలతో దేశానికి దశ, దిశను చూపిన మహోన్నత వ్యక్తిగా అభివర్ణించారు. బహుభాషా కోవిదుడుగా, దేశానికి ఒక దిక్సూచిని కల్పించిన పివి నరసింహారావు సేవలు శ్లాఘనీయం అన్నారు. దేశాన్ని 21వ శతాబ్ధం వైపు నడిపించిన ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికి ఆదర్శం అన్నారు. ప్రభుత్వ సలహాదారుడు జె.శ్రీకాంత్, బృందా రవీంద్ర, వెలుగూరి రత్నప్రసాద్, అన్నం రాజు సాయిరాం, పి.వెంకటేశ్వరరావు, ఎ.సతీష్, ఆదిత్య రామకృష్ణ, గణపతి, మన్నేపల్లి హనుమంత రావు, డేవిడ్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.